# రాజమౌళి సినిమా కోసం కసరత్తు



త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు అగ్ర హీరో మహేష్ బాబు. ఈ సినిమా అనంతరం ఆయన రాజమౌళి డైరెక్షన్‌లో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ స్థాయి హంగులతో పాన్ వరల్డ్ సినిమాగా రూపొందించబోతున్నారు. ఈ సినిమాకు పలువురు అగ్రశ్రేణి హాలీవుడ్ సాంకేతిక నిపుణులు పనిచేయబోతున్నారని తెలుస్తున్నది. ఈ సినిమా స్క్రిప్ట్‌పై రాజమౌళి తండ్రి, రచయిత విజయేంద్రప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. ఇక మహేష్‌బాబు తన పాత్ర కోసం భారీ కసరత్తులు చేయబోతున్నారని తెలిసింది. సుశిక్షితులైన నిపుణుల పర్యవేక్షణలో బాడీ మేకోవర్‌తో పాటు యాక్షన్ ఘట్టాల్లో శిక్షణ పొందనున్నారట. హనుమాన్‌ను స్ఫూర్తిగా తీసుకొని సూపర్‌హీరో తరహాలో మహేష్‌బాబు పాత్రను తీర్చిదిద్దబోతున్నారని చెబుతున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుందని తెలిసింది.

# కాత్యాయని కథాకమామీషు

గత రెండేళ్ల నుంచి తెలుగు సినిమాలకు విరామం తీసుకున్న అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ 'భగవంత్ కేసరి' చిత్రం ద్వారా మరలా ప్రేక్షకులను పలకరించబోతున్నది. బాలకృష్ణ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 19న విడుదలకానుంది. శనివారం ఈ సినిమా నుంచి కాజల్ అగర్వాల్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. కాత్యాయనిగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. ఇందులో కాజల్ అగర్వాల్ చిరునవ్వులు చిందిస్తూ మెరిసిపోతున్నది. కథాగమనంలో కాత్యాయని పాత్ర కీలకంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. శ్రీలీల, అర్జున్‌రామ్‌పాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.



# నవంబర్‌లో ఫాంటసీ ప్రపంచంలోకి..



అగ్ర హీరో చిరంజీవి నటించనున్న 157వ చిత్రాన్ని కొద్దిరోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను సోషియో ఫాంటసీ కథాంశంతో తెరకెక్కించబోతున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వి.వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి నిర్మించనున్నారు. 'అంజి' (2004) తర్వాత మరలా చిరంజీవి సోషియో ఫాంటసీ కథాంశంతో సినిమా చేస్తుండటం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నది. చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత భారీ వ్యయంతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారని సమాచారం. పంచభూతాల కథతో భారీ గ్రాఫిక్స్ హంగులతో ఈ సినిమాను రూపొందించబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం నవంబర్‌లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ తుది దశకు చేరుకుందని తెలిసింది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం.



# ఇటలీలో పెళ్లి వేడుక

యువ హీరో వరుణ్‌తేజ్, కథానాయిక లావణ్య త్రిపాఠి పెళ్లి వేడుకలు శుక్రవారం హైదరాబాద్‌లో మొదలయ్యాయి. జూన్ 9వ తేదీన ఈ జంటకు నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. త్వరలో వారు పెళ్లిపీటలెక్కబోతున్నారు. ఈ నేపథ్యంలో చిరంజీవి నివాసంలో ప్రీ వెడ్డింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో చిరంజీవి కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ఫొటోలను చిరంజీవి తన సోషల్‌మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. ఇటలీలోని టస్కానీ పెళ్లికి వేదిక కానుందని, మెగా హీరోలందరూ ఓ వారం పాటు షూటింగ్‌లకు బ్రేక్ తీసుకొని వివాహ వేడుకలో పాల్గొనబోతున్నారని తెలిసింది.

# ఏమయ్యిందో ఏమిటో..



అజ్మల్ అమీర్, పాయల్ రాజ్‌పుత్

పాయల్‌రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మంగళవారం'. అజయ్‌భూపతి దర్శకుడు. నవంబర్ 17న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. ఈ చిత్రంలోని 'ఏమయ్యిందో ఏమిటో..' అనే గీతాన్ని శనివారం విడుదల చేశారు. 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ గీతానికి చైతన్యప్రసాద్ సాహిత్యాన్ని అందించారు. హర్షిక ఆలపించారు. అందమైన గోదావరి పల్లెటూరి నేపథ్యంలో తెరకెక్కించిన ఈ పాటలో పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ కెమిస్ట్రీ ఆకట్టుకుంది. 'దర్శకుడు అజయ్‌భూపతి తెరకెక్కించే పాటలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఈ పాటకు, కథానాయిక నేపథ్యానికి చాలా సంబంధం ఉంటుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలుంటాయి. హత్యా రహస్యాల నేపథ్యంలో కథ ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. పాయల్ రాజ్‌పుత్ పాత్ర ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: స్వాతిరెడ్డి గునుపాటి, సురేష్‌వర్మ.ఎం, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అజయ్‌భూపతి.

# పల్లెటూరి యువతిగా మెప్పిస్తా!

'మా కుటుంబానికి ఎలాంటి సినీ నేపథ్యం లేదు. అయితే చిన్నప్పటి నుంచి కళలకు సంబంధించిన ప్రతీ విషయంలో ప్రోత్సహించేవారు. దాంతో స్కూల్ రోజుల్లోనే భరతనాట్యం, క్లాసికల్ సింగింగ్ నేర్చుకున్నా. 2018లో మిస్ యునైటెడ్ కాంటినెంట్స్ టైటిల్ గెలిచాను. అక్కడి నుంచి గ్లామర్ ప్రపంచంలో నా ప్రయాణం మొదలైంది' అని చెప్పింది గాయత్రి భరద్వాజ్. ఆమె రవితేజ సరసన కథానాయికగా నటిస్తున్న చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకుడు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గాయత్రీ భరద్వాజ్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమాలో నా పాత్ర గురించి చెప్పినప్పుడు కన్నీళ్లొచ్చాయి. అంత ఎమోషనల్‌గా ఉంటుంది. ఇందులో నేను మణి అనే గ్రామీణ యువతి పాత్రలో కనిపిస్తాను. నా క్యారెక్టర్ రస్టిక్‌గా ఉంటుంది. కాస్త మగరాయుడి తరహాలో డేరింగ్ నేచర్‌తో కనిపిస్తాను. 70దశకంలో జరిగే కథ ఇది. అందుకే నా పాత్ర విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నా. తెలుగు కోచ్ సహాయంతో ప్రతి డైలాగ్ అర్థాన్ని తెలుసుకొని నటించాను. ఇప్పుడు తెలుగు చాలా వరకు అర్థమవుతుంది. ఈ కథలో ఆసక్తికరమైన మలుపులు ఉంటాయి. ఇందిరాగాంధీ ఎపిసోడ్ కూడా ఉంటుంది. పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. తెలుగు ఇండస్ట్రీ చాలా బాగుంది. ఇక్కడి ప్రేక్షకుల ప్రేమ చాలా ప్రత్యేకం. తెలుగులో నా ఫేవరేట్ హీరో రామ్‌చరణ్. తెలుగులో మరో ప్రాజెక్ట్ ఓకే చేశాను. ఆ వివరాల్ని చిత్ర నిర్మాతలు వెల్లడిస్తారు' అని చెప్పింది.



గాయత్రి భరద్వాజ్

# 'అర్జున్‌రెడ్డి' ఆఫర్ వొద్దనుకున్నా!



తెలుగు చిత్రసీమలో 'అర్జున్‌రెడ్డి' చిత్రం సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. కల్ట్ మూవీగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. విజయ్ దేవరకొండకు తిరుగులేని స్టార్‌డమ్‌ను తీసుకురావడంతో పాటు దర్శకుడు సందీప్ రెడ్డి వంగాను స్టార్ డైరెక్టర్‌ను చేసింది. ఈ సినిమా బాలీవుడ్‌లో 'కబీర్‌సింగ్' పేరుతో రీమేక్ అయిన విషయం తెలిసిందే. షాహిద్ కపూర్ హీరోగా నటించారు. తన కెరీర్‌లో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రాన్ని షాహిద్‌కపూర్ తొలుత తిరస్కరించాడట. అనంతరం తన భార్య సలహాతో సినిమా చేయడానికి ఒప్పుకున్నాడట. ఈ విషయాన్ని షాహిద్‌కపూర్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'అసలు అలాంటి పాత్రలో ప్రేక్షకులు నన్ను యాక్సెప్ట్ చేస్తారో లేదో అని సందేహించాను. ఆ కథలోని అంశాలను చూపించడానికి చాలా ధైర్యం కావాలి. కొన్ని నెగెటివ్ అంశాలున్నా ఆ పాత్ర అంటే నాకు చాలా ఇష్టం. దర్శకుడు సందీప్‌రెడ్డి కథ చెప్పినప్పుడు సున్నితంగా తిరిస్కరించాను. ఆ తర్వాత నా భార్యతో చర్చించినప్పుడు 'ప్రేమకథా చిత్రాల్లో ప్రేక్షకులు నిన్ను బాగా ఇష్టపడతారు. నీ కెరీర్‌లో విభిన్న చిత్రమవుతుంది' అంటూ ప్రోత్సహించింది' అని చెప్పారు షాహిద్‌కపూర్. 2019లో హిందీలో విడుదలైన 'కబీర్‌సింగ్' చిత్రం 350కోట్ల వసూళ్లను సాధించింది.



సూర్యతేజ, మీనాక్షి గోస్వామి

# క్రైమ్ కామెడీ 'భరతనాట్యం'.

సూర్యతేజ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'భరతనాట్యం'. 'సినిమా ఈజ్ ది మోస్ట్ బ్యూటీఫుల్ ఫ్రాడ్ ఇన్ ది వరల్డ్' ఉపశీర్షిక. 'దొరసాని' ఫేమ్ కేవీ మహేంద్ర దర్శకుడు. పీఆర్ ఫిల్మ్స్ పతాకంపై పాయల్ సరాఫ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మీనాక్షి గోస్వామి కథానాయిక. శనివారం చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. యంగ్ ఫిల్మ్‌మేకర్‌గా హీరో సూర్యతేజ పడుతున్న కష్టాలను చూపిస్తూ టీజర్ ఆరంభమైంది. ఆ తర్వాత 'భరతనాట్యం' ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ కామెడీ జోనర్‌లో ఓ కొత్త ఎలిమెంట్‌ను పరిచయం చేస్తూ ఈ సినిమాను రూపొందించాం. ఎంటర్‌టైన్‌మెంట్ కొత్త పంథాలో ఉంటుంది. ప్రతీ పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. సాంకేతికంగా కూడా ఉన్నతంగా కనిపిస్తుంది' అన్నారు. 'వినూత్నమైన కథతో హీరోగా పరిచయం కావడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందించే చిత్రమవుతుంది' అని హీరో సూర్యతేజ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ ఆర్ శాఖమూరి, సంగీతం: వివేక్ సాగర్, స్క్రీన్‌ప్లే, సంభాషణలు: సూర్య తేజ ఏలే, కేవీఆర్ మహేంద్ర, కథ: సూర్యతేజ, దర్శకత్వం: కేవీఆర్ మహేంద్ర.

# మధురపూడిలో జరిగిన కథ



క్యాథలిన్ గౌడ, శివ కంఠమనేని, బాబీ

శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా నటిస్తున్న చిత్రం 'మధురపూడి గ్రామం అనే నేను'. మల్లి దర్శకుడు. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కేఎస్ శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. ఈ నెల 13న విడుదలకానుంది. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు బాబీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్ర దర్శకుడు మల్లి నాకు మంచి స్నేహితుడు. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఇద్దరం కలిసి ఉండేవాళ్లం. ఈ చిత్ర ట్రైలర్ చాలా బాగుంది. రా అండ్ రస్టిక్ ఎమోషన్స్‌తో ఆకట్టుకుంది' అని చెప్పారు. పల్లెటూరి నేపథ్యంలో జరిగే కథ ఇదని, యాక్షన్ డ్రామాగా ఉత్కంఠను పంచుతుందని దర్శకుడు తెలిపారు. భరణి శంకర్, సత్య, నూకరాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ భార్గవ్, సంగీతం: మణిశర్మ, రచన-దర్శకత్వం: మల్లి.

# 'ఆర్టిస్ట్' చేసే విన్యాసాలు



జేమ్స్ వాట్, క్రిషిక పటేల్, సంతోష్, రతన్‌రిషి

సంతోష్ కల్వచర్ల, క్రిషిక పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆర్టిస్ట్'. రతన్ రిషి దర్శకుడు. జేమ్స్ వాట్ కొమ్ము నిర్మాత. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఇటీవల ఈ సినిమా ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ కథలో థ్రిల్లర్ అంశాలతో పాటు లవ్, డార్క్ కామెడీ కూడా ఉంటుంది. ప్రతీ సన్నివేశం ఆసక్తిని పంచుతుంది. ఇప్పటివరకు రానటువంటి వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఆకట్టుకుంటుంది' అన్నారు. 'కాన్సెప్ట్ బాగా నచ్చడంతో కథ కూడా వినకుండా చిత్ర నిర్మాణానికి ముందుకొచ్చాను. ఈ సినిమాకు టాలెంటెడ్ ఆర్టిస్టులతో పాటు మంచి టెక్నీషియన్స్ కుదిరారు' అని నిర్మాత తెలిపారు. తనికెళ్ల భరణి, సత్యం రాజేష్, ప్రభాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: చందు ఏకే, సంగీతం: సురేష్ బొబ్బిలి, రచన-దర్శకత్వం: రతన్ రిషి.

